# వీటిని కూల్చే దమ్ముందా?!







హైడ్రాకు కనిపించని ఈ భవనాలు

## అనితర సాధ్యం..అద్దాల ప్రహరి!!




అద్దాల మేడ గురించి వినే ఉంటారు. చూడటం కూడా జరిగే ఉంటుంది. అయితే, కాంపౌండ్ వాల్‌ను కూడా అద్దాలతో నిర్మించడం, అవి కూడా మనిషి కంటే ఎక్కువ ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయడం ఎక్కడైనా చూశారా? అయితే, వెంటనే పక్కనున్న ఫొటోలు చూసేయండి. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో కనిపిస్తున్న ఈ అద్దాల మేడ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సమీప బంధువుదని ఆ ఇంట్లో పనిచేసేవారే చెప్పారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కోడలు ఆమె. ఇందులో కొంతమేర ఎఫ్‌టీఎల్ పరిధి ఉండగా... బఫర్‌జోన్‌లోనూ చాలా మేరకు ఉన్నట్లు తెలుస్తుంది. ఇక్కడ విశేషమేమంటే... ఈ అద్దాల మేడ చుట్టూ గండిపేట జలాశయం విస్తరించి ఉన్నప్పటికీ భూతద్దం వేసి వెతికినా ఎక్కడా ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు కనిపించవు. అవేమయ్యాయో ప్రత్యేకంగా చెప్పాలా?




## కూల్చివేతల్లో ఇదో వింత







గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ... తన పరిధిని దాటుకొని పోయి హైడ్రా కూల్చివేసిన మూడు బహుళ అంతస్తుల నిర్మాణాలు ఇవే. ఈ కూల్చివేతలతోనే హైడ్రా అడుగులపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అవుటర్ రింగు రోడ్డు వరకు మాత్రమే హైడ్రా పరిధి అని జీవో నెంబరు 99లో స్పష్టంగా ఉన్నప్పటికీ... అవుటర్ దాటి 15 కిలోమీటర్ల దూరంలోని అప్పోజిగూడలో ఉన్న ఈ నిర్మాణాలను హైడ్రా యంత్రాంగం భారీ క్రేన్లు, పొక్లెయినర్లతో వచ్చి నేలమట్టం చేసింది. హైడ్రా జీవోలో ఎక్స్‌టెండెడ్ యూఎల్‌బీ, జీపీ జాబితాలో కూడా అప్పోజీగూడ లేదు. నోటీసులు ఇవ్వడం మాట దేవుడెరుగు... కనీసం అందులో ఉన్న ఫర్నీచర్, ఇతర సామగ్రిని తీసుకునేందుకు కూడా సమయం ఇవ్వకుండా క్షణాల్లో ఈ నిర్మాణాలను కూల్చివేశారు. అయితే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే... ఈ నిర్మాణాలు ఒక వెంచర్‌లో ఉన్నాయి. వెంచర్ ముఖద్వారం నుంచి లోపలికి వెళ్లగానే కుడివైపు గండిపేట చెంతనే భారీ నిర్మాణాలు (ఇప్పుడు కూల్చివేసిన నిర్మాణాలకు సమాంతరంగా) కొనసాగుతున్నాయి. హైడ్రా యంత్రాంగం వాటి ముందుగానే కూల్చివేతలకు వెళ్లిందని అర్థమవుతుంది. ఇక హైడ్రా కూల్చివేసిన మూడు నిర్మాణాల వెనక (మధ్యలో రోడ్డు) మరో భారీ నిర్మాణం రూపుదిద్దుకుంటున్నది. దీంతో ఆ నిర్మాణం ముందు నిలబడే హైడ్రా యంత్రాంగం కూల్చివేతలు చేపట్టింది. ఇంకాస్త ముందుకు వెళితే రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి సమీప బంధువుగా చెబుతున్న అద్దాల మేడ ఉంటుంది. కూల్చివేసిన నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే మిగిలిన నిర్మాణాలు అవే పరిధిలో ఎందుకు రావో అటు జలమండలి, ఇటు హైడ్రా యంత్రాంగానికే తెలియాలి. కనీసం సామాన్యుడు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించుకునేందుకు అక్కడ ఎక్కడా హద్దు రాళ్లు లేవు. పోనీ... కూల్చివేసిన నిర్మాణాల వరకు మాత్రమే ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందనే సాకును చూపినా... ఎలాగూ వంద ఫీట్ల బఫర్ జోన్ ఉంటుంది. బఫర్ జోన్‌ను రక్షించాల్సిన బాధ్యత కూడా ఇదే యంత్రాంగంపై ఉంది. కానీ ఆ బాధ్యతను విస్మరించడమే ఇప్పుడు హైడ్రా అడుగులపై విస్తృత చర్చకు దారి తీసింది.









## గండిపేటకు చెంత చెలి'మేడ'!!

గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో రూపుదిద్దుకున్న ఈ గెస్ట్ హౌస్ గ్రీన్‌కో గ్రూపు ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ది. ప్రధాన రహదారి నుంచి మొదలై జలాశయం ఎఫ్‌టీఎల్‌లోకి చొరబడి మరీ ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణాన్ని చేపట్టారు. అంటే ఈ గెస్ట్‌హౌస్ ఏ మేరకు విస్తరించి ఉందో మీరే ఊహించుకోండి. ఇందులో మరో విశేషమేమిటంటే... రోడ్డు వైపునకు ఎవరైనా ఇంటి గేటు పెడతారు. అయితే ఈ గెస్ట్‌హౌస్‌కు రహదారివైపు ప్రహరి నిర్మాణాన్ని చేపట్టి.. లోపల జలాశయం వైపు మాత్రం ఇనుప కంచె వేశారు. అంతటితో ఆగకుండా ఆ ఐరన్ ఫెన్సింగ్‌తోనే జలాశయం ఎఫ్‌టీఎల్‌ను వీళ్లు నిర్ధారించారనే ఆరోపణలు ఉన్నాయి. అంటే ఒకవిధంగా గండిపేటకే హద్దు నిర్ణయించారన్న మాట.




## హద్దురాయి సాక్షిగానే నిర్మాణాలు





సాగరం ఒడ్డున.. పంట పొలాల మధ్యలో రాజసాన్ని ఒలకబోసేలా నిర్మించిన ఈ ఫాంహౌస్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిది. హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ హద్దు రాయి సాక్షిగా ఈ భారీ నిర్మాణం రూపుదిద్దుకున్నది. నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. అయినప్పటికీ ఈ భారీ నిర్మాణాన్ని చేపట్టారు. అంతేకాదు.. ఈ ఫాంహౌస్ గేటు ముందు ఉన్న ఖాళీ ప్రదేశంలోనే ఫ్లోరింగ్‌ను గ్రానైట్ బండలతో నింపడాన్ని చూస్తే, ఈ భవనం ఎంత ఖరీదైందో అంచనా వేసుకోవచ్చు.




## రంగరంగా..పక్కది కూలిందెట్ల... ఇది కూలదెట్ల?!

ఇటీవల హైడ్రా కూల్చివేసిన నిర్మాణం ఇది. గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందున కూల్చివేశామనేది హైడ్రా స్పష్టీకరణ. మరి... దానిని ఆనుకునే మరో నిర్మాణం ఉంది. అది ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదా? అనేది సామాన్యుడి సందేహం. ఒకవేళ కూల్చివేయని నిర్మాణం పక్కనుంచే ఎఫ్‌టీఎల్ గీత వెళ్లిందనే సాకు చూపే అవకాశాలు ఉండొచ్చు. అదే నిజమైతే... ఎఫ్‌టీఎల్‌ను ఆనుకొని వంద ఫీట్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. బఫర్‌జోన్‌ను కాపాడాల్సింది కూడా అదే హైడ్రా కదా! కానీ ప్రత్యేకంగా ఓ నిర్మాణాన్ని కూల్చడం.. మరో నిర్మాణాన్ని కూల్చకుండా వదిలేయడం అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.




## హైడ్రాకు కనిపించని గెస్ట్‌హౌస్..




గండిపేట జలాశయం బఫర్‌జోన్‌తో పాటు కొంతమేర ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ నిర్మాణమైన ఈ గెస్ట్‌హౌస్ కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజుది. అందుకే హైడ్రాకు ఇది కనిపించలేదు. ఇదే వరుసలో ఉన్న ఒక స్పోర్ట్స్ అకాడమీ పరిధిలోని నిర్మాణాలను ఇటీవలే హైడ్రా యంత్రాంగం కూల్చివేసింది. కానీ దీని జోలికి మాత్రం రాలేదు. అసలు హైడ్రా అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. విషయమేంటని ఆరా తీస్తే, కూల్చివేతలకు హైడ్రా సిద్ధమైందని తెలియగానే.. సదరు కేంద్ర మాజీ మంత్రివర్యులు ఆగమేఘాల మీద ఢిల్లీ నుంచి ఫోన్లు చేయించారని రాజకీయవర్గాల్లో గుప్పుమన్న ప్రచారం. ఇది సక్రమ నిర్మాణమా?? అక్రమ నిర్మాణమా?? అని దీన్నిబట్టి అర్థమవ్వట్లేదూ..!